క్లుప్తంగా

ఉత్సాహంగా మహిళా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 72వ వార్డు వినాయక నగర్ వుడా కాలనీలోని లివింగ్ క్రైస్ట్ చర్చిలో ఫోకస్ మినిస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహిళా కిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం క్రీస్తు గీతాలను ఆలపించారు. పాస్టర్లు కె.సామ్‌సన్, కె.ఆరోన్ జాన్ సుజిత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఏఎన్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్' వితరణ



ఈశ్వరరావుకు సరకులు అందిస్తున్న సంస్థ సభ్యులు

పెదగంట్యాడ: రోగి కుటుంబానికి ఏఎన్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సాయం అందించారు. 65వ వార్డుకు చెందిన ఆటోడ్రైవర్ సుంకర ఈశ్వరరావు అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో ఏఎన్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అతన్ని పరామర్శించారు. రాగాల భాస్కరరెడ్డి ఆర్థిక సాయంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను వార్డుకు చెందిన రెయ్యి రత్న చేతుల మీదుగా సోమవారం బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో సాడి రామారావు, కనకేశ్వరరావు, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ఉత్సాహంగా 'డీఏవీ' క్రీడా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల చైర్మన్ సంజీవరావు

ఉక్కునగరం: స్థానిక డీఏవీ పాఠశాలలో సోమవారం క్లస్టర్ స్థాయి క్రీడాదినోత్సవం ఉత్సాహంగా జరిగింది. క్రీడల్లో కొవ్వూరు, రాజాం, పాలకొండ, ఒనుక ఢిల్లీ, సుజాత నగర్, బుచ్చిరాజు పాలెం, అనకాపల్లి, ఉక్కునగరం పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉక్కు డీఏవీ ప్రిన్సిపాల్ నైస్ షాజి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదరంగం, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలు త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న సౌత్ మీట్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ షాజి తెలిపారు.

మురుగు.. కనుమరుగు

నాడు

డ్రైనేజీలకు అనుసంధానంగా ఉండాల్సిన కల్వర్టులు శిథిలమై ఎక్కడి మురుగు అక్కడే పేరుకు పోయి రోడ్డుపై నడవలేని స్థితి. చిన్న వర్షానికే మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి రోడ్లు దుర్గంధభరితంగా ఉండేవి. పలకలు శిథిలమై వాహనాల రాకపోకలకు అవస్థలు పడేవారు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వార్డుల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం కల్పించింది. అభివృద్ధి పనుల్లో భాగంగా కల్వర్టులు పటిష్టంగా నిర్మించారు. ఇప్పుడు ఎక్కడా మురుగు నిలవడం లేదు. పాదచారులు, వాహనచోదకులకు రాకపోకలకు మార్గం సుగమం అయింది.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో 90 శాతం అభివృద్ధి పనుల్లో భాగంగా పలు చోట్ల కల్వర్టుల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 90 శాతం పనులు పూర్తి కాగా, మరికొన్ని చకచకా జరుగుతున్నాయి. వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, మింది, గుడివాడ అప్పన్నకాలనీ, కాళికానగర్, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్‌నగర్ కాలనీ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వార్డులో మొత్తం 10 కల్వర్టులు నిర్మించారు. వాటిలో పెద్దవి 3, చిన్నవి 7 ఉన్నాయి. మింది, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ, కాళికానగర్, అక్కిరెడ్డిపాలెం ప్రాంతాల్లో పకడ్బందీగా కల్వర్టులు నిర్మించడంతో రాకపోకలకు మార్గం సుగమం అయిందని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

66, 68 వార్డుల్లో కల్వర్టుల నిర్మాణం

రాకపోకలకు మార్గం సుగమం

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజల హర్షం



కైలాసనగర్‌లో అందుబాటులోకి వచ్చిన కల్వర్టు

కైలాసనగర్‌లో రూ.20 లక్షలతో..

గాజువాక: 66వ వార్డు కైలాసనగర్‌లోని అమృత నర్సింగ్ హోమ్‌వద్ద గెడ్డపై నూతనంగా నిర్మించిన కల్వర్టుతో వాహన చోదకుల కష్టాలకు చెక్ పడింది. గతంలో ఇక్కడున్న కల్వర్టు పదడుగులు కూడా ఉండేది కాదు, ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లాలంటే మిగిలిన వారు ఆగిపోవాల్సిన పరిస్థితి ఉండేది. పక్కనే ఆస్పత్రి కూడా ఉండటంతో అంబులెన్స్‌లకు సైతం రాకపోకలకు ఇబ్బంది ఏర్పడేది. ప్రధాన సమస్యలు పరిష్కరించాలన్న ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు సమస్యను పరిష్కరించారు. పాత కల్వర్టును తొలగించి రూ.20 లక్షలతో కొత్త కల్వర్టును అందుబాటులోకి తీసుకొచ్చారు. కల్వర్టు వెడల్పును కూడా భారీగా పెంచారు. సుమారు 18 అడుగుల వెడల్పుతో కల్వర్టును నిర్మించి వాహన చోదకుల సమస్యలకు చెక్ పెట్టారు. కల్వర్టు రెండు వైపులా రక్షణ గోడలను నిర్మించి అందంగా రంగులు వేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వివేకానందకాలనీలో కల్వర్టు నిర్మాణానికి ముందు పేరుకున్న మురుగు



కల్వర్టు నిర్మాణం తర్వాత ఇలా..

కల్వర్టులు నిర్మించిన ప్రాంతాలు	వార్డు : 68 — మింది, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ, కాళికానగర్, అక్కిరెడ్డిపాలెం
వార్డు : 66	కైలాసనగర్ (20లక్షలతో 18 అడుగుల కల్వర్టు)



ఇది కదా అభివృద్ధి

మాజీ కౌన్సిలర్ గోపాలకృష్ణ ఇంటి ఎదురుగా..



మాజీ కౌన్సిలర్ గోపాలకృష్ణ ఇంటి ఎదురుగా వీధిలో కల్వర్టు నిర్మించిన తర్వాత..

గతంలో రోడ్డంతా మురుగే..



వర్షాలు వస్తే చాలు డ్రైనేజీల్లో మురుగు రోడ్డుపైకి వచ్చి చేరేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. కల్వర్టుల నిర్మాణంతో కాలువల్లోని మురుగు నిల్వ ఉండే పరిస్థితి లేదు. కాలువలన్నీ పూర్తి స్థాయిలో నిర్మించారు. భారీ వర్షం వచ్చినా కల్వర్టుల్లో మురుగు నిల్వ ఉండకుండా పెద్ద డ్రెయిన్ల ద్వారా నీరు పోతోంది.

– రామ గుప్తా, వాసవీ సేవాసంఘం అధ్యక్షుడు, అక్కిరెడ్డిపాలెం



అక్కిరెడ్డిపాలెం చర్చి వద్ద శిథిలమైన కల్వర్టు



కల్వర్టు నిర్మాణం జరిగిన తర్వాత..

పనులు త్వరితగతిన పూర్తి చేశారు



68వ వార్డు పరిధిలో మురుగు కాలువలు, డ్రైన్లు, కల్వర్టు నిర్మాణాలు చకచకా జరిగాయి. వార్డులో ప్రధాన సమస్యలైన కల్వర్టుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడం, వెంటనే పనులు చేపట్టడం, వాటిని సకాలంలో పూర్తి చేయడం జరిగింది. ఇంత త్వరగా పనులు పూర్తి చేసి, సమస్య పరిష్కరించడం అభినందనీయం. మా కాలనీవాసులకు రాకపోకల కష్టాలు తీరాయి.

– డి.వి.వర్మ, వివేకానంద కాలనీ

వర్షం వస్తే అడుగు వేయలేకపోయేవాళ్లం



వర్షాకాలం వస్తే రోడ్లన్నీ బురదమయంగా ఉండేవి. పిల్లలు స్కూలు నుంచి వస్తున్నారంటే ఎలా వస్తారో అని చాలా భయపడేవాళ్లం. ఇప్పుడు ఈ పరిస్థితి లేదు. ఎక్కడికక్కడ కల్వర్టు నిర్మాణాలు చేపట్టి మురుగు సమస్యను తీర్చారు. కల్వర్టు నిర్మించడంతో మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండటం లేదు.

– వి.లక్ష్మి, గృహిణి, అక్కిరెడ్డిపాలెం

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1026వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్విరామ పోరు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నీలకంఠుడికి నీరాజనం

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



అక్కిరెడ్డిపాలెం ఉమారామలింగేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఉక్కు బీసీ గేటు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: నీలకంఠుడికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువ జాము నుంచే అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

సెక్టార్–6 శివాలయంలో జ్యోతిర్లింగార్చన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–6 శివాలయంలో ఉదయం విశేష అభిషేకాలు, పూజలు, సాయంత్రం జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఉక్కునగరం దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగీత జనకులం పి. దుర్గారావు ఆధ్వర్యంలో స్వరార్చన నిర్వహించారు. విద్యార్థినులు శ్రీనికేత్ సాయి అక్షిత, సాయి అక్షర, పరిణీత పాల్గొన్నారు.

- బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.
- త్రిశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.
- రవీరేస్ సమీప పురాతన శివాలయంలో జరిపించిన పూజల్లో కణితి, వడ్లపూడి కాలనీలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

10న సేవా కార్యక్రమాలు



సంఘీభావం తెలుపుతున్న నాయికులు

అగనంపూడి: జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి కల్యాణ మండపంలో ఈ నెల 10న సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మానవ హక్కుల సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల చైర్మన్ ఎ.సత్యనారాయణ తెలిపారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగనంపూడిలో నిర్వహించనున్న కార్యక్రమంలో జాతీయ స్థాయి నుంచి మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నా యకులు ఎం.ప్రసన్నకుమారి, బి.సత్యనారాయణ, ఎం.వెంకటరమణ, కె.హనుమంతురావు, వి.నారా యణ రావు, జె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఎనిమిదో విడత వార్డు వాలంటీర్ల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. http://40.81.241.107/APVOLUNTEER20/apVolunteer 090420 201049.vt వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

తెరిపివ్వని వాన



ఫైర్‌స్టేషన్ జంక్షన్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షంనీరు



లోతట్టు ప్రాంతాల ప్రజలకు భోజనాలు వడ్డిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు



గంగవరం పోర్టు వంతెన వద్ద గెడ్డలోని పూడికలు తీయిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, కాల్వలు పొంగిపొర్లాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వాన పడుతూనే ఉండడంతో రోడ్లు జలమయమయ్యాయి. పెదగంట్యాడ మండలంలోని లోతట్టు ప్రాంతాలైన బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. గెడ్డల్లో నీరు నిలిచిపోకుండా ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పూడికలు తొలగించారు. గంగవరం పోర్టు వంతెన వద్ద జేసీబీ సాయంతో నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

- లోతట్టు ప్రాంతాల ప్రజలకు బీజేపీ నాయకులు సహకారం అందించారు. 76వ వార్డు స్వతంత్రనగర్, బాలచెరువు, 65వ వార్డు భానోజీతోట, 73వ వార్డు పాత కర్ణవానిపాలెంలో సేవలందించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోంబాబు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రోహిణి, భువనేశ్వరి, రంజిత్, కుమార్ పాల్గొన్నారు.

ఐలా కమిషనర్‌కు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆటోనగర్–ఈ బ్లాక్ ఆర్‌హెచ్ కాలనీ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కంపెనీలో అర్ధరాత్రి వరకు వెల్డింగ్ పనులు చేయడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారని నాయకులు ఐలా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆదారి శ్రీను ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. కంపెనీలో పనుల వల్ల వాయు, శబ్దకాలుష్యం వెలువడుతోందని పేర్కొన్నారు. కంపెనీ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో కంపెనీలో పని చేసే కార్మికులు మహిళలను అసభ్యకరంగా చూడటంతో, వారు బయటికి రావడానికి ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీపీ ఆకస్మిక తనిఖీ

గాజువాక, దువ్వాడ పోలీస్ స్టేషన్లలో రికార్డుల పరిశీలన



గాజువాక పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీస్ కమీషనర్ డాక్టర్ ఏ.రవి శంకర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక, దువ్వాడ పోలీస్ స్టేషన్‌లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. గాజువాక స్టేషన్‌లో రిసెప్షనిస్టులుగా ఉన్న కానిస్టేబుళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. స్టేషన్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది షిఫ్టులు, జనరల్ డైరీ, స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిధిలో రద్దీగా ఉన్న ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. పారిశ్రామిక ప్రాంతంలో సీసీ కెమెరాలు మరిన్ని ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి రవాణాను అరికట్టాలన్నారు. ఆయన వెంట ఏసీపీ త్రినాథ్, డీసీపీ ఆనంద్ రెడ్డి, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాలు

గోపాలపట్నం: స్వచ్ఛతను ప్రతీ ఒక్కరూ వ్యాపకంగా మార్చుకోవాలని వర్క్స్ అండ్ ఎస్టేట్ విభాగాధిపతి లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ అన్నారు. స్వచ్ఛతా పక్షోత్సవాలను సోమవారం ఎన్ఎస్‌టీఎల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వచ్ఛతపై పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ మానవాళి శ్రేయస్సు కోసం మన ఆరోగ్యం కోసం పరిశుభ్రతను పాటించాలన్నారు.కాలుష్య స్థాయిని తగ్గించడం కోసం అందరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హెచ్.ఎన్.దాస్, సీహెచ్‌వీ సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ సమన్యాయం



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆకాంక్షించారు. సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వార్డులోని గొల్లపేట సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో ప్రజలకు 18కోట్ల 76 లక్షల 33వేల 288 రూపాయల లబ్ధి చేకూర్చామని వివరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ఆర్పీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పేదలకు కళ్లద్దాల పంపిణీ

అగనంపూడి: గీతం మెడికల్ కళాశాల, ఎంవీవీఎస్ మూర్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 85వ వార్డులో కంటి రోగులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ట్రస్ట్ చైర్మన్ భరత్ సారథ్యంలో గత నెల నాలుగో వారంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి సోమవారం కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో కత్తి తిలక్, గంతకోరు అప్పారావు, డొక్కా రమేష్, ఈగల పోలినాయుడు పాల్గొన్నారు.